# కరివేపాకు మొక్క

శ్రీ ఓగేటి శివరామకృష్ణ



రామచంద్రరావు ఆఫీసు నించి యింటికివస్తూ...సరస్వతిని పిలచి. ఆరుఅంగుళాల పొడవున్న మొక్కను ఆమెకిస్తూ 'చూశావా యిది కరివేపాకు మొక్క మరి మనకు కరివేపాకు లేనిలోటుండదు. మా ఏజంటు కొత్తగా డాబాకట్టాడు కదూ...వాళ్ళ దొడ్లో వేయించటానికి— ప్రత్యేకంగా బంట్రోతును పనిగట్టుకొని పంపి తెప్పించాడు-వాడు తెచ్చిన అరడజను మొక్కల్లో... రెండు మూడుమార్లు బలవంతంమీద అడగ్గా, అడగ్గా ఒక మొక్క యిచ్చాడు. ఉన్న గుమస్తాలంతా అడిగినా... చిరచిరలాడుతూ నా ఒక్కడికే యిచ్చాడు. మరి కరివేపాకు మొక్క యెంత జాగ్రత్తగా పెంచుతావో యేమో' అన్నాడు.

'మీకేమయినా పిచ్చియెత్తిందేమిటి?.. కరివేపాకు మొక్కకోసం — ఏజంటు నాశ్రయించటం యెందుకూ? ఆయనకు యివ్వటం యిష్టంలేనప్పుడు బలవంతాన అడిగి అడిగి తెచ్చుకోటంయెందుకూ?... పోనీ యేమయినా స్వంతయిల్లయితే నాలుగు మొక్కలూ వేసుకోవచ్చు...' అద్దెకొంపాయిరి. నిలకడగా ఉండేవాళ్ళమా పోనీ అనుకుంటే— ఈ దినం ఒకచోటా, మరో దినం మరోచోట ఉండేవాళ్ళమాయెను. ఇంటివాళ్ళకు అవసరం అనితోస్తే... వాళ్ళుదొడ్లో వేసుకోరూ...మీ కేమిటో పిచ్చిగాని' అంది సరస్వతి—

'పిచ్చి అను యేమను— ఏమిటో ఏజంటు దొడ్లో వేయించటానికి మొక్కలు తెప్పించటంతోటే— వాటిలో ఒకటి పెంచాలని బుద్ధిపుట్టింది... బ్రతిమాలితే బ్రతిమాలితే యిచ్చాడు—ఆయన శ్రమపడి యిచ్చినందుకు, మనం దాన్ని పెంచి పెద్దచేసి సంతోషించాలి... మొక్క యిస్తూ మరీమరీ అతడు అన్నాడు. 'మీకు మొక్క పెంచటం అంటే తగినశ్రద్ధ ఉండదనుకొంటాను. అందరికంటే ముందడిగినది మీరవటంవల్ల యిచ్చాను. జాగర్తగా మొక్కను పెంచండి — దాని కేవిధమైన లోటూ రాకుండా కాపాడాలి'—అని.

'ఓ- అని నే నాయనకు దాగ్దానమిచ్చా. ఆయన పెళ్లో డబ్బు యిస్తున్నట్లుగాబాధపడ్డాడు—ఎలాగో యిచ్చాడు—మరి పెంచి, పెద్దచేసి యెంతపనైనా చెయ్యాలి-ఏమంటావ్?' అని అన్నాడు తిరిగి రామచంద్రరావు.

'మీ పిచ్చి చాలా బాగుంది. కానీ, పారేస్తే గుప్పెడు ఆకు గుమ్మంలో తెచ్చి పడేస్తారే; ఏమిటో కరివేపాకు మొక్కను తెచ్చి— ఇంత హంగామా?'

'హంగామా యేముంది. దీన్ని పెంచి పెద్దదిచెయ్యాలి... దీనికి పిల్లల్ని పుట్టించాలి...ఇంటివాళ్ళ కవసరంలేకపోతే, మన వాటాభాగంలో మనం వేసుకొని పెంచుకొంటే వాళ్ళు వద్దంటారా?— ఆలోచించి చూడు...మొక్క మనదొడ్లో ఉన్నట్లయితే మరి మనం ఒకళ్ళను అడగవలసిన అవసరం ఉండదు— కొంచెం ఖర్చు తగ్గుతుంది. మనం దానికి యేమీతిండీ, బట్టా యిచ్చి పోషించనక్కర్లేదు. కొంచెం నీళ్ళూ, కుడితీ పోస్తే, దాని మానాన్న అది బ్రతుకుతుంది. పిల్లాపీమా ఉన్న అతడే 'మాయింటావిడకు మొక్కలంటే ప్రాణం. అందులో కరివేపాకు చెట్టంటే మరీనూ— ఆమె ప్రతిరోజూ వేధించటంవల్లనే యీ దినం ఈమొక్కలు తెప్పించటం జరిగింది' అన్నాడే—పిల్లా నల్లీ ఉన్న ఆమె మొక్కలు పెంచటంలో—తీరుబడి చేసుకొని శ్రద్ధచూపుతూన్నప్పుడు—సంతానం-నాస్తి— అయిన నీవు కొంచెం మొక్కను పెంచలేనంటే చాలా ఆశ్చర్యపడవలసి వస్తుంది—

'సరే... మంచి గొడవ తెచ్చిపెట్టారు- ఏదో మూల పాతండి—బ్రతుకుతే బ్రతుకుతుంది— చస్తే చస్తుంది' అన్నది సరస్వతి కొంచెం గట్టిగా విసుక్కుంటూ.

'శుభం పలకరా మంకెన్నా అంటే— యేమిటో అన్నాట్ట. అలా ఉంది నువ్వు చేసే పని. మొక్క వేసి— పెంచమని సుమారుగంట కాలంనుంచి బతిమాలుతూంటే యేమేమిటో తెలివితక్కువ ప్రసంగం చేస్తావెందుకు? పిల్లా జెల్లాలేని నీలాటివాళ్ళకు కొంచెం మొక్కను పెంచటంకూడా కష్టంగానే ఉంటుంది— ఏదో పారేశాను— ఏదో చేశానంటే వీల్లేదు. మొక్కను నీ అధీనం చేస్తున్నప్పుడు—దాన్ని కంటి రెప్పల్లో పెట్టుకొని కాపాడే భారం నీది—'

'సరే బాబూ—మరి గొడవ చాలించండి—ఆకలేస్తోంది'—

'భోజనంసంగతి తర్వాత చూద్దాం ముందీపని కానీ—నీ చెయ్యి చాల మంచిటద—మీ చెల్లెలంటూంటే రెండుమూడు మార్లు విన్నాను—నీ చేత్తో పెట్టిన ఆనప్పాదు తెగకాయలు కాస్తుందట. అందువల్ల నువ్వే ప్రత్యేకంగా మొక్కను నాటాలి. నీళ్ళుపొయ్యాలి. అవి పూర్తవుతేగాని భోజనం చేసేది లేదు—ముందు నువ్వు మరి యీ పని కానివ్వాలి'—అని పట్టుపట్టాడు రామచంద్రరావు.

(30-వ పేజీ చూడండి)

# కరివేపాకు మొక్క

(16-వ పేజీ తరువాయి)

'మంచి గొడవ తెచ్చిపెట్టారు-భోజనం చేసిన తర్వాత పొద్దాంలెండి—ఎప్పుడో వండిన వంట చల్లారిపోతూంది... అరటికాయ వేపుడు చల్లారినట్లయితే మీరు మరి ముట్టుకోరుగా'

'ఫరవాలేదులే— అన్నట్లు మరో గంటకు వర్జ్యం. దుర్ముహూర్త ఘడియల్లో మొక్కను పాతటం యేమిటి—మొక్కను ముందు పాతితీరాలి... భోజనం యెక్కడికి పోతుంది. తర్వాత చెయ్యొచ్చులే'—

'మరి మీపట్టుదల—పట్టుదలే-- పట్టిన పట్టు విడిచేది లేదు— మాయదారి మొక్క! ఈ కుఱ్ఱతనం చేష్టలు చూస్తే... ప్రక్కవాళ్ళు యేమనుకొంటారు?—

'ఏమనుకొంటారు— దంపతులనుకొంటారు— కరివేపాకు మొక్క అంటే ప్రేమ అనుకొంటారు—ఎవరు యేమనుకొంటేయేం— మన క్కావలసింది మొక్క అభివృద్ధిగాని'—

'అబ్బ—మరి మీతో యింతే'— అంటూ దొడ్లోకి వెళ్లింది సరస్వతి. సరస్వతి వెనకాలనే వెళ్ళాడు రామచంద్రరావు. గరిటకాడతో గొయ్యితీశాడు; స్వయంగా... మన్నులో ఉన్న గులకరాళ్ళు, మసిబొగ్గులూ, వగైరాలన్నిటినీ యేరి బయట పారేశాడు—మొక్క వేళ్ళు విశాలంగా త్వరితంగా పాకడానికి వీలుగా ఉండేందుకై... ఒక్కడుగు లోతు గొయ్యి తీసి... అందులో ఏడెనిమిది అంగుళాల భాగం, తిరిగి మట్టితో కప్పేశాడు— భార్యచేత మొక్కను గోతిలో పెట్టించి కప్పించాడు — అచిరకాలంలో మొక్క అభివృద్ధి పొందాలని మనసులో భగవంతుణ్ని ప్రార్థించుకొన్నాడు—సరస్వతి స్వహస్తాలతో మొక్కమీద ఒక చెంబుడు నీళ్ళుపోసింది: ఉత్సాహంతో చుట్టూ బోదె చేసి... యేవేవో కలలు కంటూ, చేతులూ, కాళ్ళూ కడుక్కొని భోజనానికి వెళ్ళాడు రామచంద్రరావు. స్వహస్తాలతో వేసిన మొక్క యెక్కడ యెండమూలకంగా ఎండిపోతుందో అని సరస్వతి ఒక పాత బియ్యపుబుట్ట — ఆ మొక్కమీద మూత గూడా పెట్టింది!

రామచంద్రరావు — ఏజంటును కరివేపాకు మొక్క అడిగిన వేళావిశేష మనండి సరస్వతిచేతి చలవనండి, మరియేమనుకోండి, మొక్కమాత్రం, రోజూ బియ్యం కడిగిపోస్తున్న కుడితిసహాయంతో యేపుగా పెరగటం ప్రారంభించి— పొడుగ్గా— కొమ్మలతో తయారయింది. రామచంద్రరావుకు జోస్యంమీద నమ్మకం లేకపోయినా— మొక్క అభివృద్ధితో మరదలుపిల్ల చెప్పిన ఆనపకాయల జోస్యం అభిమానం మీద అభివృద్ధి పొందింది.

మొక్క అభివృద్ధితో సరస్వతికీ— రామచంద్రరావుకు మరికొంచెంపని పెరిగింది.:. ఇంట్లో యేపనీలేకుండా ఉన్నప్పుడు ఒకమారు మొక్కదగ్గర కెళ్ళటం, యేమిటో పిచ్చిగా చూడటం, దానిచుట్టు, వీధులో దూడ వేసిన పేడ తెచ్చి వెయ్యటం, నీళ్ళుపోయటం, మొక్క పొడవు కొల్చటం, ఎంత యెత్తు పెరుగుతుందో, ఎన్నికొమ్మలు వేస్తుందో ఊహించడం సరస్వతి కార్యక్రమమైంది.

ఆఫీసు లేని వేళల్లో మొక్క దగ్గరకు వెళ్ళటం, చుట్టూ ఉన్న పాతబోదిని చెడగొట్టి కొత్తబోదినిచేసి, నీటి వాడకం హెచ్చుగా ఉండేవైపుకు బోదిని లాక్కొని వెళ్ళటం—చెట్టుకొమ్మలు, రెమ్మలు, లెక్కపెట్టడం— కోయకుండా వాసన చూడటం— రామచంద్రరావు పనియైంది.

ఆఫీసుకు వెళ్ళేముందు మొక్కను చూచి వెళ్ళేవాడు రామచంద్రరావు; ఆఫీసు నుంచి తిరిగి వచ్చేసరికి యేమాత్రం పెరిగిందో యేవిధమైన మార్పువచ్చిందో అని, సరాసరి— కాళ్ళయినా కడుక్కొనకుండా మొక్కను పరామర్శించి వచ్చేవాడు.

'సరసూ చూశావా?.... మన మొక్క అప్పుడే — రెండడుగుల యెత్తు పెరిగింది- అయిదారు కొమ్మలు పెట్టింది. ఏజంటుగారి చెట్టు అంత యేపుగా పెరగటంలేదట. భార్య చెయ్యి మంచిదేగాని బండ నేలట— అందువల్ల ఎన్నినీళ్ళు పోసినా యింకదట- అందువల్ల సరిగా పెరగటంలేదన్నారాయన... మరచా...మొక్కను ఆలా కన్పించేలా ఉంచేకంటే, ఏమైనా బుట్ట అల్లించి దానిలో ఉంచేటట్లయితే బాగుంటుంది— ఎవళ్ళుచూసినా దిష్టి కొట్టూంటారు. ఏం యేమంటావ్?

ప్రథమంలో భర్తపనులు పిచ్చిగా కన్పించినా రానురాను—ఆ మొక్కంటే ఆమెలో పిచ్చిప్రేమ పెంపొందింది— అతగాడికంటె చేదస్తం ఆమెలో హెచ్చిపోయింది. అందువల్ల అతడన్నదానికల్లా 'అవును. ఆలాగే కానియ్యండి— బాగుంటుంది' అనేదికాని ఒకదానికీ యెదిరించేది కాదు.

స్వశక్తితో కష్టపడి మొక్కనయితే పెంచుతున్నారుగాని— పలవలూ, చిలవలూ వేసి పొడుగవుతున్న మొక్కనుంచి- రెండు ఆకులు కోయటానికి యిరువుర్లో యే ఒక్కరూ యిష్టపడేవారు కాదు!

దొడ్లో మొక్క వేసినా— కానీ పెట్టి కరివేపాకు కొనటం—సరస్వతి మానేది కాదు— చెట్టుండగా—ఒకరొబ్బ కో కోక— కానీ తగలేసి యెందుకు కొంటున్నావ్?' — రామచంద్రరావు గూడా కసురుకొనే వాడుకాదు; అతనికా విధంగా కోయటం యిష్టంలేదు కాబట్టి!

దొడ్లో చెట్టేసి పెంచటం యింటావిడకు యెంతో ఆనందాన్ని కల్గించింది. భార్యాభర్తలు— పిల్లలులేనివారవటం వల్ల— మొక్కను పెంచుకొని—కన్నబిడ్డ విధంగా చూసుకొంటూన్నారనీ, ఆమె ఒకటి రెండు మార్లు యిరుగు పొరుగువాళ్ళతో కూడా అంది. ఆమాటలు విన్న సరస్వతి యేమీ తేల్చక మాట్లాడక వూరుకొంది; అయితే యింటావిడకు ఒకవిషయం మాత్రం కంటకంగా ఉండిపోయింది...ఆవిధంగా చెట్టు పెంచుతూన్నప్పుడు— ఒకర్లోయినా కోసుకొనకుండా యుండటం ఆమెకిష్టంలేక పోయింది— ఒకానొక పర్వదిన సమయంలో—మరి ఊరుకోలేక— 'కొంచెం...కరివేపాకు కోసి యియ్యండీ' అని సరస్వతిని అడిగిందావిడ.

సరస్వతి ఈ మాటకు జవాబు అప్పటికప్పుడే మరి తడుముకోకుండా జెప్పేసింది. 'చెట్టు ఆకు కొయ్యడానికి వీలులేదమ్మా.. ఎంత అవసరం వచ్చినా మేమయినా ముట్టుకొనటం లేదు. కానీ పారేస్తే... బోలెడాకు—అవసరం వస్తే నేనే— కొనుక్కొంటున్నాను'—

ఇంటావిడకు యీమాట అనటంతోటే రోషం పుట్టుకువచ్చింది—తన దొడ్లో మొక్కవేసి పెంచుతున్నప్పుడు, తానడిగినప్పుడు యివ్వకపోవటంలోని కారణం కేవలం—తన్ను అవమానపర్చటమే అని ఆమె అర్థం చేసుకొంది—ఇంటి యజమానులుగా తాను అడిగి గౌరవం యిచ్చినప్పుడు—తన్నావిధంగా అగౌరవపర్చగూడదని ఆమె తలబోసింది. ఆమె గూడా అప్పటికప్పుడే జవాబిచ్చింది. 'పోనీలేవమ్మా. ముష్టికరివేపాకు—కానీ పారేస్తే—బుట్టడు తెచ్చి పారేస్తాడు— ఈమాత్రం దానికోసం—సిగ్గువిడచి నోరు తెరచి లేదని—మొహమాటం చంపుకోనవసరం లేదులే ఎలాగయితే పెంచుతున్నారో మొక్కను'—

ఆమె అంతటితో ఊరుకొనకుండా, తన భర్తతోనూ, యిరుగు పొరుగు అమ్మలక్కలతోనూ.. యిష్టం వచ్చిన విధంగా చెప్పింది.. అంతా తలో మాటా అన్నారు.

కాని వారిలో యెవ్వరూ గూడా - కేవలం అది మొక్క మీద ఉండే ప్రేమచేతనే తప్ప - అవసరం అయినప్పుడు, సరస్వతి గూడా డబ్బు పెట్టి కొంటున్నదనీ ఊహించుకోనలేక పోయ్యారు.

ఈవిధంగా సంభాషణ జరిగిన సంగతి - సరస్వతి రామచంద్రరావుతో గూడా చెప్పింది. అతను విని 'మామంచి మాటన్నావు - కానీ పారేస్తే బోలెడు వచ్చి పడ్తున్నప్పుడు - ఆ కక్కుర్తి యెందుకు పడ్డారో కనుక్కోనలేకపోయ్యావూ? ఇక్కడ మొక్క పెంచుతున్నది.. వచ్చి కోరినవారందరికీ... ఆకు సంతర్పణ చేయటంకోసం కాదని యీసారి అడిగితే చెప్పు - అడిగిన వెంటనే యిస్తే మంచాళ్ళు. లేకపోతే చెడ్డాళ్ళూ. చాలా బాగుంది' - అన్నాడు.

రామచంద్రరావు మాటలు. విన్న యింటావిడ, మరి నోరు తెరచుకొని యేం అనలేకపోయింది గాని యిరుగు పొరుగు క్షితోమాత్రం - తనకు తోచిన విధంగా యిష్టమొచ్చినట్లుగా రామచంద్రరావును గురించీ, సరస్వతిని గురించీ చెప్పసాగింది. అదీ ఆమె చేసిన మహాఘనకార్యం!

రామచంద్రరావు, సరస్వతి మరి చెట్టు విషయంల్లో చాలా జాగర్తగా మసులుకోసాగారు.. మొక్కకు బుట్ట - చుట్టూ దరికి వెళ్లడానికి వీలులేకుండా ముళ్లకంచా యేర్పాటు చేయబడ్డాయ్.

ఇంటివాళ్లకు యిదంతా విడ్డూర్యంగానూ, విచిత్రంగానూ ఉండేది...

ఇరుగు పొరుగు వాళ్లుకూడా సరస్వతిని రెండు మూడు మార్లు... మంచితనంగా 'కొంచెం కరివేపాకు పెడ్తారా?' అని అడిగారు - ప్రత్యేకంగా ఒకరు బాలెంతరాలు కోసం... కొంచెం యివ్వవల్సిందని ప్రార్థించారు - ఎందరెన్ని విధాలుగా అడిగినా సరస్వతి ఒకేఒక విధంగాజవాబు యిచ్చేది. అదీ భార్యాభర్తలు యేకాభిప్రాయంమీద తయారు చేసుకొన్న జవాబే! అదేమంటే 'మీరు కొనటమయితే బాగుంది. కాని యివ్వనందుకు మన్నించండి. దొడ్లో మొక్క ఉన్నా, దాని ఆకు కోయటం మాకే ఇష్టం - లేకపోవటంవల్ల - కొనుక్కొంటున్నాం. మీరంతగా బాధిస్తే బయట యెక్కడి నుంచయినా...కొని తెచ్చి యిస్తాను' - అని..

'మీకు యివ్వటం యిష్టంలేనప్పుడు - మీ కెందుకమ్మా ఆ శ్రమ! - అంటూంటే వారు వాళ్లు పైకి, లోలోపల తిట్టి పోసినా.

ఏది ఏవిధంగా జరిగిపోయినా, ఎ శే విధంగా తలబోసినా రామచంద్రరావు గాని, సరస్వతిగాని కష్టపడి—మొక్కను పెంచటంలో నిమగ్నులై పోయారేగాని—చివరకు—ఒక్క రెొబ్బయినా కోయడానికి యిష్టపడేవారు కాదు! కోసి-ఒకరికిచ్చే వారు కాదు తాముపయోగించుకొనే వారు కాదు. సరస్వతి వేలి మహత్యం అనండి—మరేవిధంగా తలబోయండి" మొక్కమాత్రం నానాటికి అభివృద్ధి పొందుతూ పెరగసాగింది. మొక్క పెరుగుదల-రామచంద్రరావు, సరస్వతులలో ఆనందం కల్గింపుతూంటే—ఇరుగు పొరుగు వాళ్ల లోనూ—చివరకు యింటి వారిలోనూ ద్వేష భావాలు రగొల్కొలుసాగింది. అయితే కారణం లేకుండా కజ్జాకుమాత్రం రావటానికి వీలెక్కడుంది?

రామచంద్రరావు ఆ పట్టణం వచ్చిన వేళావిశేషమో యేమోగాని, మూడు సంవత్సరాల కాలం దొర్లిపోయిందిగాని—మరి బదలీమాత్రం అంతవరకూ రాలేదు... బదలీవిషయం — యోచనగాని - ప్రయత్నంగాని అంతవరకూ అతడు చేయలేదు-చేయ తలబెట్టలేదు—

ఒకరోజు సాయంకాలం వేళ—రామచంద్రరావు ఆఫీసునుంచి యేమిటో విచారంగా యింటికి వచ్చాడు. వచ్చి రావటంతోటే—మొక్కను ఒకమారు వెళ్లి చూసి రావటం అతని దినచర్యల్లో ఒక భాగం. కాని ఆనాడు మాత్రం ఆవిధంగా చెయ్యలేదు.

అతడ్ని చూడటంతోటే సరస్వతికి కొంచెం ఖంగారు... కలిగింది.

'ఏమండీ?'— అలా ఉన్నారని ప్రశ్నించింది ఆమె. రామచంద్రరావు జవాబు చెప్పలేక మౌనంగా ఊరుకొన్నాడు—ఏమిటో విషయం అని ఖంగారుపడుతూ — భర్తతో వచ్చిన బంట్రోతును ప్రశ్నించింది కారణాన్ని... వాడేమిటో డొంకతిరుగుడు కబుర్లు చెప్పి 'బ్యాంకు ఏజంటు గారి అమ్మాయి వివాహం యీవాళరాత్రి కదండి... కొంచెం కరివేపాకు దొడ్లోది కోసి యివ్వమన్నారండి - అయ్యగారితో చెప్పారండి... ఆకుకోసం వచ్చానండి. అంతకన్న విశేషం మరేం లేదండి' అన్నాడు— సరస్వతి కారణం ఊహించుకో కలిగింది. వెంటనే మరి ఆలోచించకుండా జవాబు చెప్పింది: 'ఏజంటు అవనీ మరి యెవరవనీ. దొడ్లో కరివేపాకు చెట్టునుంచి ఒక రెొబ్బయినా కొయ్యడానికి వీల్లేదు. కావలసివస్తే కొనుక్కొనమను. డబ్బులు యిస్తాం' అని.

బంట్రోతు రెండాకులు యెక్కువ చదివినవాడు.. ఎక్కడ కబుర్లు అక్కడ చెప్పేవాడు. అందువల్ల మరి తడుముకోకుండా 'అవును. అది నిజమేనండి.. పావలాపారేస్తే బండెడాకిస్తారు—అన్నాడు.

రామచంద్రరావుకు గూడా ఒకయోచన తోచింది.. ఓపావులా పోతే పోయిరి...కరివేపాకు—కూరల మార్కెట్టులోది.. కొనుక్కొని వెళ్లి యిచ్చేస్తే! ఏజంటు ఎక్కడిది.. ఏమిటని ప్రశ్నించితే కద - ఈయోచనతో బంట్రోతుచేతిలో పావులా పెట్టి—ఆకు కొనుక్కొని వెళ్లవలసిందని-దొడ్లోదే యిచ్చారని చెప్పవలసిందని బంట్రోతుతో బతిమాలుతూ చెప్పాడు—రామచంద్రరావు.

'ఆ.. అలాగే' అంటూ నిష్క్రమించాడు బంట్రోతు. 'అమ్మయ్య' అని గుండెమీద చెయ్యివేసుకొన్నాడు రామచంద్రరావు—

'ప్రతీదానికే... మొక్క విషయం... మీ ఏజంటుతో చెప్పడం యెందుకు? అన్నివాగ్లు మీరు చెప్పటంవల్ల ఆయన అడిగాడు. ప్రతీవాళ్లకూ...కరివేపాకుతో మంచి వేళాకోళమయిపోయింది. పేటంతా ఒకే రుసరుస. అన్నది సరస్వతి బాధ భరించలేక.

నిగనిగలాడుతూ... చెట్టు దినదినాభివృద్ధి పొందుతూ—అయిదారు అడుగుల యెత్తుపెరిగి.. గుబురుగా ఆకు వేసింది... వేస్తూంది. కాని యింతలో నెలాఖరవటం.. రామచంద్రరావుకు హటాత్తుగా బదలీ అవటం జరిగింది.. ఆఫీసులో వాళ్లంతా.. ఏజంటు ఏదో కారణంచేత ట్రాన్స్ఫరు చేయించాడని అనుకొన్నారు.

ఏమయితేనేం—యిటు రామచంద్రరావుగాని అటు సరస్వతిగాని యిల్లు వదలి వెళ్ళేటప్పుడు—కరివేపాకుచెట్టు వదలి... వెళ్లడానికి మనస్కరించలేదు—మరి ఉద్యోగధర్మప్రకారం బయలుదేరుతూ—చెట్టుమీద ఉండే ప్రేమ వాత్సల్యాలచేత—మొదలంట లాగి తీసుకొని వెళ్లటానికి సంసిద్ధులయ్యారు. కానయితే... వేళ్లు దిట్టంగా పాతుకొని ఉన్న మొక్క అవటంవల్ల, బలం కొద్దీ లాగేసరికి సగానికి విరిగి ఊరుకొంది...

రామచంద్రరావుకు—ఆ సగభాగంకూడా, అక్కడ వదలి వెళ్లటం యిష్టంలేకపోయింది.. మొదలంట త్రవ్వి—వేళ్లతోనున్న బోడి మొక్కను తీసుకొని...వెళ్లాడు మరియే ఉద్దేశాలో మనస్సులో పెట్టుకొని. ఈ సంఘటన చూచిన యింటావిడ తెల్లబోతూంటే- వీధివాళ్ళుమాత్రం— 'పిచ్చివాళ్ళు' అని నామకరణం చేశారు. ★